విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

మణిపూర్ ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉంది

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి

విశాలాంధ్ర - చింతపల్లి: మణిపూర్ సంఘటన మహిళా లోకాన్నేగాక సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ అన్నారు. ఆ పార్టీ అల్లూరి జిల్లా సమితి సమావేశం స్థానిక గిరిజన ఉద్యోగ భవన్లో సోమవారం ఆ పార్టీ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొట్టిక సత్యనారాయణతో విచ్చేసిన బాలేపల్లి మాట్లాడుతూ రెండు మతాల మధ్య, రెండు ఆదివాసి గిరిజనుల తెగల మధ్య తగాదాలు సృష్టించి ఆ రాష్ట్ర వ్యాప్తంగా మతోన్మాదాన్ని రేకెత్తించి ఘర్షణ వాతావరణం కల్పించడం బాధాకరమన్నారు. దేశంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం మణిపూర్ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం కొనసాగడం వలన జరిగిన సంఘటనపై ప్రతిపక్షాలు గల మెచ్చుతున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. పార్లమెంట్లో ప్రతిపక్షాలు సమస్యను లేవనెత్తినా సమాధానం ఇచ్చేందుకు కేంద్రంలోని అధికార పక్షం కేవలం 36 సెకండ్లు కేటాయించడం ప్రతి పక్షాలను కించపరచడమే అన్నారు. మణిపూర్లో జరుగుతున్న ఘటనలకు నిరసనగా ఈ నెల 25న నిరసన కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో మణిపూర్ ఘటనపై చర్చ చేపట్టాలని సీపీఐ సహా బీజేపీయేతర పక్షాలు నిలదీస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి విష్ణుమూర్తి, మహిళా నాయకురాలు డి.బీమలమ్మ, షేక్ రెహమాన్, గంజారి రమణ పాల్గొన్నారు.

మణిపూర్లో తక్షణమే శాంతి నెలకొల్పాలి

ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - విశాఖ: రెండు నెలలు నుంచి మణిపూర్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ స్పందించకపోవడం దారుణమని ఏపీ మహిళ సమాఖ్య జిల్లా నాయకురాలు అత్తిలి విమల, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుత రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు విమర్శించారు. మణిపూర్ ఘటనలపై విశాఖ ఉమెన్స్ కాలేజీ వద్ద నుంచి ఎల్ఐసి బిల్డింగ్ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, అఖిల భారత యువజన సమాఖ్య, అఖిల భారత విద్యార్థి సమాఖ్యల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మణిపూర్లో హింసాకాండ జరుగుతున్న సమయంలో ప్రధాని మోడీ కోట్లాది రూపాయల ప్రజాధనంతో విదేశీ పర్యటనలు చేయటం సిగ్గుచేటు అన్నారు. ఈ హింసాకాండపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకుంటే తప్ప మోడీ మౌనం వీడకపోవటం పట్ల పలు అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రపంచానికి భారతదేశంలో దిక్సూచి అన్న మోడీ వ్యాఖ్యలపై మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిజెపి పాలిత రాష్ట్రాల్లో, ప్రతిపక్షం హోదా ఉన్న రాష్ట్రాల్లో కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజాస్వామ్యం, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. దానికి మణిపూర్ తాజా ఉదాహరణ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారం చేసి హత్య చేసిన దారుణ ఘటనలను దేశ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని విజ్ఞప్తి చేశారు. నేరస్తులను కఠినంగా శిక్షించి మణిపూర్లో శాంతిని నెలకొల్పేంత వరకూ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కెల్ల రమణ, శివాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు శేఖర్, సింహాచలం, మహిళ నాయకులు ఎం.ఏ బేగం, పద్మ విద్యార్థులు పాల్గొన్నారు.

అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - విశాఖ: అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 4వ తేదీ నుంచి అదానీ గంగవరం పోర్టు కార్మికులు పోరాటం చేస్తున్నారని నాయకులు తెలిపారు. అయినా ప్రభుత్వం, యాజమాన్యం సమస్యలను ఇంత వరకు పరిష్కరించ లేదన్నారు. దీంతో కార్మికులు, కార్మిక కుటుంబాలు తీవ్ర కష్టాల్లో పడటంతో పాటు యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. 3వేల మందికి పైగా పనిచేస్తున్న అదానీ గంగవరం పోర్టును షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు పరిధిలో ఉంచడం అన్యాయమని, దీనిని ఫ్యాక్టరీ యాక్టు పరిధిలోకి తేవాలన్నారు. చట్టపరమైన హక్కులు పొందటం, యూనియన్ ఏర్పాటు చేసుకోవడం కార్మికుల హక్కు అని, దీనిని యాజమాన్యం సహించకపోవడం, కార్మిక నాయకులు, కార్మికులు 29మందిని విధుల నుండి నిలిపివేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎం.డి.నజీర్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వై.కొండయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ ఇ.చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దాసు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎస్.సుధాకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.జగన్, హెచ్.ఎం.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.అప్పారావు, ఐఎన్టియుసి జిల్లా కార్యదర్శి కె.ఈశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావు, గంగవరం పోర్టు యూనియన్ నాయకులు వై.ఎల్లాజి, కె.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

తర్లువాడలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

విశాలాంధ్ర - ఆనందపురం: తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతులకు కషాయాలు తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చీడపురుగులు, గొంగల పురుగులు నివారణకు ముందస్తు జాగ్రత్తగా బ్రహ్మాస్త్రం తయారు చేయించారు. ఇందులో భాగంగా 5 రకాల ఆకులు వేపాకులు 3 కేజీలు, జిల్లేడు ఆకులు 2 కేజీలు, ఆముదం ఆకులు 2 కేజీలు, కోమాకులు 2 కేజీలు, సీతాఫలం ఆకులు 2 కేజీలు తీసుకొని మెత్తగా దంచి, 10 లీటర్ల ఆవు మూత్రంలో వేసి 3 లేదా 4 పొంగులు వచ్చేంత వరకు ఉంచి తర్వాత 48 గంటలు చల్లార్చి, ఒక పలుచని గుడ్డతో వడగట్టుకొని, ఎకరానికి 100 లీటర్ల నీటిలో రెండున్నర లీటర్ల బ్రహ్మాస్త్రంను కలుపుకొని స్ప్రే చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్త రామారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాచురల్ ఫార్మింగ్ అసోసియేట్ అనురాధ, ఇంటర్నల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ పైడిరాజు, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఎంతో మేలు

ఎమ్మెల్యే గొల్ల బాబురావు

విశాలాంధ్ర - యస్.రాయవరం: జగనన్న సురక్ష పథకం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు.

సోమవారం మండలంలో వమ్మవరం, పెదగుమ్ములూరు గ్రామాల్లో జగనన్న సురక్ష పథకం గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు అవసరమైన ధ్రువపత్రాలు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఈ పథకమును అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, తహశీల్దార్ విజయకుమార్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సర్పంచులు పాలపర్తి పాపారావు, కె.నాగరత్నం, ఎంపీటీసీ బాలం సూరిబాబు, వైసీపీ మండల కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు, మండల సచివాలయాల కన్వీనర్ డి.సందీప్, సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అల్లాడ నాగరాజు, డి.అంజి, జి.సత్తిబాబు, వెలగా శ్రీను, మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ ఆత్మహత్య

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి కోరమండల్ పరిశ్రమలో లాస్య శ్రీ లోగోస్టిక్స్ కంపెనీ (కోరమండల్)లో డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్న శివశంకర్ సాహూ (22) బాత్ రూమ్ నెం 10లో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సోమవారం మల్కాపురం పోలీస్ పరిధిలో కేసు నమోదైనట్లు మల్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జీడి బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం

పుష్పంధర్ కుమార్ షాహు అనే వ్యక్తి ద్వారా వివరాలు సేకరించామని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మధ్యప్రదేశ్ ప్రాంతానికి చెందిన వాడని, గత 20 రోజులు నుండి లాస్య శ్రీలో డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్నారని అయితే బాత్రూంలో ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించామని పోలీసులకు తెలిపాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని జీడీ బాబు తెలిపారు.

ప్రజల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఉపముఖ్యమంత్రి బూడి

విశాలాంధ్ర - వి.మాడుగుల: ప్రజల ఆర్థికాభివృద్ధే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. సోమవారం మాడుగుల మండలం ఎల్.పొన్నవోలు పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప-గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, పార్టీలకు అతీతంగా నేరుగా అర్హులకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. ఎటువంటి పైరవీలు, లంచాలు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. అనంతరం 40 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఎల్.పొన్నవోలు పంచాయతీలో 13 కోట్ల 70లక్షల వరకు సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఎల్.పొన్నవోలు గ్రామంలో కింతలి వల్లాపురం గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు చెవిటి, మూగ కావడంతో సొంత నిధులతో రెండు చెవిటి మిషన్లు అందించారు. ఎల్.పొన్నవోలు ప్రాథమిక పాఠశాలలో నాడు నేడు పనులకు సంబంధించి 16 లక్షల పనులకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ పెదబాబు, వైస్ ఎంపీపీలు తాళపురెడ్డి వెంకటరాజారాం, కొత్తపల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, మండల సచివాలయ కన్వీనర్ టమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ వి.ప్రభాకర్రాజు, తహశీల్దార్ పివి.రత్నం, ఎంపిడిఒ మీనాకుమారి పాల్గొన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధికార ప్రతినిధిగా శ్రావణ్

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ భీమిలి నియోజక వర్గం సింహాచలం ప్రాంతానికి చెందిన పేరి శ్రావణ్ కుమార్ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధికార ప్రతినిధిగా నియామకం జరిగింది. కర్నూల్ వేదికగా జరిగినటువంటి ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవ సంఘ సమాఖ్య సమావేశంలో ఆయన్ని రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ప్రకటించినందుకు వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ ముఖ్య సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్కు, రాష్ట్ర అధ్యక్షులు వెల్లాల మధుసూదన్ శర్మకు సంఘ సభ్యులు ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

1న ముఖ్యమంత్రిచే ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన

జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన నగర ప్రజల జీవన విధానానికి తగ్గట్టు ఉపయోగపడే ఇనార్బిట్ మాల్ను

ఆగస్టు 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డిచే శంకుస్థాపనకు శ్రీకారం చుట్టడం జరుగుతుందని జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన 5వ జోన్ 45వ వార్డు పరిధిలోని కైలాసపురం రోడ్లో ఏర్పాటు చేయనున్న ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన, పార్కింగ్, స్టేజి, రెస్ట్ రూమ్ తదితర ఏర్పాట్లను గూర్చి అధికారులతో సమీక్షించి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజనీరు రవి కృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మరో వారం పాటు భారీ వర్ష సూచన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్రానికి మరో వారం పాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు భారత వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని వెల్లడించింది. జూలై 24న పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారనుండటంతో ఉత్తర, దక్షిణకోస్తా, రాయలసీమ, యానాం ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు,

కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. కాగా సోమవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

అర్హులైన ప్రతిఒక్కరికి సత్వర న్యాయం జరగాలి

జిల్లా ఇన్చార్జి మంత్రి పీడిక రాజన్న దొర

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రభుత్వ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టిలతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి పనుల తీరును క్షుణ్ణంగా సమీక్షించారు. పదిమందికి మంచి జరిగే పనులను వేగంగా పూర్తి చేసినట్లయితే ప్రజలకు న్యాయం చేసినట్లు అవుతుందని చెప్పారు. గృహ నిర్మాణం రోడ్లు భవనాలు పుర పాలక శాఖ, జల వనరుల శాఖ, వైద్య, ఆరోగ్యం, విద్య సంక్షేమం, నాడు నేడు, ఉపాధి హామీ, స్త్రీ శిశు సంక్షేమం, జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో మంత్రులు సమీక్షించారు. రాజన్న దొర మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమ స్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించా లన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆశయం మేరకు ప్రతి ఒక్కరికి సత్వర న్యాయం చేయాలన్నారు. రహదారుల మరమ్మత్తులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల న్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, సీపీఓ జి.రామారావు, జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, డిఎంహెచ్వో డాక్టర్ హేమంత్, డిపిఓ శిరీష రాణి, హౌసింగ్ పిడి రమామణి, పి ఆర్ ఈఈ వీరన్న నాయుడు, డీఈవో వెంకట లక్ష్మమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ, బంజరు, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీకన్య కూడలి నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ధర్నా ర్యాలీ నిర్వహించి రెవిన్యూ డివిజనల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు మాకిరెడ్డి రామునాయుడు, శివలంక కొండలరావు మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గం నాలుగు మండలాల సుమారు 40 నుండి 70 సంవత్సరాల ఏళ్ల తరబడి అటవీ బంజర పోడు భూములు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రైతులు సాగు చేసుకుంటూ కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారని అన్నారు. చాలా దశాబ్దాల నుండి ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టిలోకి తీసుకురావడం జరుగుతుందని సీపీఐ ఆధ్వర్యంలో గిరిజన హక్కు చట్టం ప్రకారం భూములు పట్టాలు ఇవ్వాలన్నారు. ఇప్పటికైనా గిరిజనులకు గిరిజనేతరులకు సాగు చేసుకున్న రైతుకు పట్టాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఉపాధి పని దినములు 200 రోజులు పెంచాలని, రోజువారి ఉపాధి కూలీ 600 రూపాయలు ఇవ్వాలని గతం కంటే ఇప్పుడు ఉపాధి హామీ పథకం బడ్జెట్ కోత విధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, వి.అర్జున్రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు జి.రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లి మాణిక్యం, సీపీఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, కిల్లాడ అప్పల నాయుడు, శెట్టి పైడియ్య, మగ్రి అప్పలనాయుడు, జోగారావు పాల్గొన్నారు.

అర్హులకు ఇవ్వకుండా

ఇతర గ్రామాల వారికి ఇళ్ల స్థలాలు ఎందుకిచ్చారు...?

విశాలాంధ్ర - పాయకరావుపేట: గ్రామంలో అర్హులుండగా ఇతర గ్రామాలకు చెందిన వారికి తమ గ్రామంలో ఇళ్ల స్థలాలు ఎందుకు ఇచ్చారని మండలంలోని ఎస్.నర్సాపురం గ్రామ సర్పంచ్ భర్త మంచాల గోపి అధికారులను ప్రశ్నించారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. దరఖాస్తు చేసుకున్న వారికి ధృవపత్రాలు పంపిణీ చేశారు. సదస్సులో సర్పంచ్ భర్త మంచాల గోపి మాట్లాడుతూ పెదరామభద్రాపురం, శ్రీరాంపురం గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఉండగా ఆగ్రామానికి చెందిన వారికి ఆయా గ్రామాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తమ గ్రామంలో ఇచ్చారని తెలిపారు. దీంతో ఎస్.నర్సాపురం గ్రామంలో అందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు పొందాల్సిన 20మంది అర్హులు ఉన్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలోని జగనన్న లేఅవుట్లో సామాజిక అవసరాల కోసం 20సెంట్లు స్థలం కేటాయించారని, ఆస్థలంలో పెదరామభద్రాపురం గ్రామానికి చెందిన వారు ఇళ్లు నిర్మించుకుంటున్నారని, దీనిపై అధికారులకు తెలియక పోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పంచాయతీలో వాటర్ ట్యాంకులు క్లీనింగ్ చేయడానికి కూడా ఒక్క రూపాయి లేకుండా నిధులు ప్రభుత్వం తీసుకుందని ఆరోపించారు. స్వీపర్లకు జీతాలు ఇవ్వడానికి కూడా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కాపులకు బిసి ధృవపత్రాలు ఇవ్వాలంటూ గ్రామానికి చెందిన కాపులు సురక్షలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంచాల అనిత, ఎంపీడీఓ సాంబశివరావు, ఇన్ఛార్జి ఈఓపీఆర్డి వై.సత్యనారాయణ, డిటి కె.నూకరాజు, పంచాయతీ కార్యదర్శులు బిఎబిఎల్ మూర్తి, మల్లిఖార్జునరావు, నాయకులు పల్లెల వెంకట్, పల్లెల కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమా స్వరూపి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం గ్రామం వద్ద ఉన్న ప్రేమా స్వరూపి మినిస్ట్రీస్ నాయకురాలు లిల్లి పుట్టినరోజు పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని గోపాలపట్నం గ్రామంలో వాహనాల టైర్లకు పంచర్లు వేసుకునే దివ్యాంగుడు సుంకర ఆనంద్కు రూ.20 వేలు విలువైన గాలి మిషన్, రూ.2 వేలు నగదు పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన వితంతువు అనుపోసు సునీతకు రూ.5 వేలు విలువైన నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అలాగే గోపాలపట్నం శివారు పెద్దిరాజుపాలెం గ్రామంలో భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న

వితంతువులు కుండల జ్యోతి, కొర్ని సత్యవతిలకు రూ.5వేలు చొప్పున నగదు పంపిణీ చేశారు. అంతేగాక దివ్యాంగులుగా ఉన్న సుంకర ఆనంద్, కుండల జ్యోతిలకు వచ్చే నెల నుండి ప్రతీ నెల రూ.2 వేలు ఆర్థిక సహాయం చేయనున్నట్లు ప్రేమా స్వరూపి మినిస్ట్రీస్ నాయకురాలు లిల్లి తెలిపారు. ఆర్థిక సహాయం పొందిన వారంతా లిల్లికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమా స్వరూపి మినిస్ట్రీస్ చేస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు గ్రామస్తులు కొనియాడారు.

వంతెనల పనులు వేగవంతం చేయాలి

గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే

విశాలాంధ్ర - జి.మాడుగుల: ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న సారవాణిపాలెం జీలుగులపాడు వంతెన పనులు వేగవంతంగా పూర్తిచేయాలని గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే అధికారులను ఆదేశించారు. మండలంలో సోమవారం పర్యటించిన ఆయన ముందుగా బీసుపురంలో కాఫీ ప్లాంటేషన్ను సందర్శించారు. కాఫీ రైతులతో మాట్లాడి కాఫీ తయారీ విధానం, పల్పింగ్ యూనిట్ పనితీరు విధానం వంటి వాటి వివరాలను రైతులని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సారవాణి పాలెం చేరుకొని నిర్మాణంలో ఉన్న వంతెనను, జీలుగులపాడు వంతెనను పరిశీలించి డిసెంబర్లోగా కచ్చితంగా వంతెనలు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అభిషేక్, ఈఈ శ్రీనివాస్, డీఈఈ సుబ్బారావు, జేఈ గణేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సమస్యలపై కాంతిలాల్ దండేకు ఎంపీటీసీ మీతుల, సర్పంచ్ అప్పారావులు వినతిపత్రం అందించారు.

ఓటర్ సర్వే సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఎటువంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎలక్ట్రోల్ అధికారి డి.అనిత బీఎల్ఓలకు సూచించారు. సోమవారం కింతాడ పంచాయతీలో జరుగుతున్న ఓటర్ సర్వేలో పాల్గొని పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఇంటికి బీఎల్వోలు వెళ్లాలని ఓటర్ల లిస్టులో ఉన్న పేర్లు సక్రమంగా ఉన్నాయా లేవా, ఇంటి నెంబరు, పోలింగ్ బూత్ నెంబర్లు అన్ని పరిశీలించాలన్నారు. ఒకే ఇంటి నెంబర్తో ఎక్కువ ఓట్లు ఉన్నట్లయితే వాటిపై మండల స్థాయి అధికారులకు వెంటనే తెలియజేయాలి అన్నారు. ఆమె వెంట డిప్యూటీ తహశీల్దార్ రమేష్, మండల ఎన్నికల అధికారి త్రిమూర్తులు, బీఎల్ఓ అనంత్ పాల్గొన్నారు.

ఇంటింటికి ఓటరు నమోదు పరిశీలన

విశాలాంధ్ర - సింహాచలం: భీమిలి నియోజకవర్గం 98వ డివిజన్ సింహాచలం పోస్ట్ ఆఫీస్ వీధిలో బూత్ నెంబర్ 229లో బూత్ లెవెల్ ఏజెంట్ మజ్జి చంద్ర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాశర్ల ప్రసాద్, విశాఖ పార్లమెంట్ టీడీపీ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి సతివాడ శంకర్రావు, 98వ డివిజన్ తెలుగు యువత అధ్యక్షుడు గుసిడి అవినాష్ బాబు, బూత్ లెవెల్ ఆఫీసర్ కార్తీక్ పాల్గొన్నారు.

స్పందనకు వినతుల వెల్లువ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: కలెక్టరేట్లోని స్పందన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక "జగనన్నకు చెబుదాం-స్పందన" కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ ఝాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ, సచివాలయం నోడల్ అధికారి మంజుల వాణి, డీఆర్డీఏ పీడీ స్వీకరించారు. 305 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమానికి 37 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. ఆస్తి తగాదాలు చీటింగ్ తదితర ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్.బి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై చక్రధర్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో చినదొడ్డి గల్లు శాఖ గ్రంథాయలంలో గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతి వేడుకలను గ్రంథాలయాధికారి కె.జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జనార్ధన్ మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణయ్య 1934 నుండి 1948 మధ్యకాలంలో కొస్తా ఆంధ్రాలో అనేక గ్రంథాయాలు స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుపై శిక్షణ

విశాలాంధ్ర - యలమంచిలి: సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న గ్రామీణ వ్యవసాయ సహాయకులకు ఈ క్రాప్ నమోదుకు సంబంధించి ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం మండల వ్యవసాయాధికారి ఆర్.రవి ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్లో పనిచేస్తున్న వీఏఏలు, వీహెచ్ఏలు తమ పరిధిలో ఉండే రైతుల ఈ పంట నమోదు కార్యక్రమాన్ని విధిగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఏ విధంగా ఈ పంటను యాప్లో నమోదు చేయాలనేది ఆన్లైన్ వీడియో ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మోహన్రావు, సుమంత, సౌజన్య, శంకర్, గోవింద్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర

➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

సజ్జలను కలిసిన ఎమ్మెల్యే చెట్టి

విశాలాంధ్ర - పెదబయలు: ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని సోమవారం అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మర్యాదపూర్వకంగా కలిశారు. అరకు నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై వివరించారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం 200 రోజులు చేసిన కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలు అలాగే ప్రభుత్వంపై గిరిజనులు చూపిస్తున్న అభిమానాన్ని వివరించారు. సచివాలయ పరిధిలో అభివృద్ధి కొరకు తక్షణమే తమ నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే గిరిజన రైతులకు సబ్సిడీపై పనిముట్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, రాష్ట్ర నాయకులు గంపరాయి సూరయ్య, జర్సింగి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అయ్యంకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 133వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వైస్ ప్రెసిడెంట్ పథకం శెట్టి భూలోకరావు పాల్గొని అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారిణి బి.సూర్య కళ మాట్లాడుతూ తెలుగు నాట గ్రంథాలయ ఉద్యమానికి బాసటగా నిలిచి, నవంబర్ 14 నుండి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుపుటకు మూలపురుషుడుగా అయ్యంకి నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సెక్రటరీ ఆదారి రామకృష్ణ కమిటీ మెంబర్ పెంటకోట గణేష్, చదువరులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాదవ కమ్యూనిటీ భవనం పనుల పరిశీలన

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 94వ వార్డు పురుషోత్తపురంలో నిర్మిస్తున్న యాదవ కమ్యూనిటీ భవనం పనులను వైసీపీ అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చందు యాదవ్ సోమవారం ఉదయం పరిశీలించారు. గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో పెందుర్తి శాసనసభ్యులు అదీప్ రాజ్ మంజూరు చేసిన యాదవ కమ్యూనిటీ భవనం పనులను పరిశీలించిన చందు యాదవ్ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పేర్లు శాశ్వతంగా ఈ ప్రాంతంలో నిలిచేలా భవనం చిరస్థాయిగా ఉండిపోవాలని ఆయన ఆకాంక్షించారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం చేరుకుంపాలెం పంచాయతీ మిర్యాలవీధి గ్రామంలో భార్య మందలించిందని కుంజం రామారావు అనే వ్యక్తి పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. జడ్డంగి ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం పనిపాట లేకుండా ఎంతకాలం ఇలా తాగి తిరుగుతావ్ అని భార్య అన్నపూర్ణ మందలించడంతో మనస్తాపం చెందిన రామారావు పురుగుల మందు తాగాడు. అది గమనించిన కుటుంబీకులు ఏలేశ్వరం హాస్పిటల్‌కి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కి తరలించారని, అక్కడ వైద్యం పొందుతూ ఆదివారం మృతి చెందాడని తెలిపారు.

కొనసాగుతున్న రోడ్డు విస్తరణ ప్రక్రియ

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీలో 100 అడుగుల మేరకు అధికారికంగా నిర్ణయించిన రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. సోమవారం కూడా తొలి దశలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రభుత్వ భూముల్లో ఉన్న భవనాల తొలగింపు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. తొలి దశలో ఇప్పటికే అబీద్ సెంటర్లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లోని భవనాలను కూల్చివేశారు. అల్లూరి సీతారామరాజు పోరాటానికి సాక్షిభూతంగా ఉన్న నర్సీపట్నం మెయిన్ రోడ్డులో ఉన్న హైవర్డ్, కవర్ట్ సమాధుల స్థలంలో నిర్మించిన షాపులను సోమవారం కూల్చివేశారు. ముందుగా మున్సిపల్ శాఖ అధికారులు షాపులను ఖాళీ చేసుకోవాలని సమాచారం ఇచ్చి, ఆ తర్వాత పాపులను తొలగిస్తున్నారు. రెండో దశలో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. సుమారు 54 అక్రమ నిర్మాణాలను ఇప్పటికే గుర్తించారు.

హైస్కూలుకు కంప్యూటర్ బహూకరణ

విశాలాంధ్ర - కే.కోటపాడు : చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థి నరసింహారాజు ఒక కంప్యూటర్ ప్రింటర్ అందజేశారు. చౌడువాడ గ్రామానికి చెందిన ఈయన ప్రస్తుతం హైదరాబాదులో స్థిరపడ్డారు. తన కన్న ఊరికి చదివిన పాఠశాలకు సహాయ సహకారాలు అందించాలన్న ఉద్దేశంతో గతంలో ఇదే హైస్కూల్లో ఉన్న విద్యార్థుల డైనింగ్ హాలుకు రెండు లక్షల రూపాయలు ఖర్చుతో ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా పదవ తరగతిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈర్ల అప్పారావు నరసింహారాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్పందనకు వెల్లువెత్తిన వినతులు



విశాలాంధ్ర - విశాఖ కలెక్టర్: స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. 335 విజ్ఞప్తులు అందాయి. జాయింట్ కలెక్టర్ కె.యస్ విశ్వనాథన్ ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కారం కొరకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు బజార్ కార్డులు, జీవీఎంసీ లో ప్రణాళిక అనుమతులు, టీడీఆర్, డ్రైనేజీ సమస్యలపై అధిక ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు నిత్యావసర సరుకులు సమకూర్చాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలో 20వ తేదీన వరద పెరగటంతో అధికారులు కాన్వాసింగ్ చేసి ప్రజలను పునరవాస కేంద్రాలకు తరలించారు. ఇప్పటికీ ఐదు రోజులు కావస్తున్నా పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని సి.పి.ఎం. పార్టీ నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు ఆరోపించారు. సోమవారం తాత్కాలిక శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యవసర సరుకులు, బియ్యం, కిరోసిన్, బరకం వంటి సదుపాయాలు కల్పించాలని అన్నారు. తక్షణమే వారికి పదివేల రూపాయలు ఇచ్చివారికి నిత్యావసర సరుకులు, కిరోసిన్, బియ్యం, పాలు, అందించాలని అధికారులను నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గూటాల శ్రీనివాసరావు, శీరపు తాతబాబు, వరద బాధితులు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ రోజుల్లో ఎక్కువ ధ్రువీకరణ పత్రాలు మంజూరు అభినందనీయం

విశాలాంధ్ర - చింతపల్లి: తక్కువ రోజుల్లో ఎక్కువ దృవీకరణ పత్రాలు మంజూరు చేసిన తహాశీల్దార్ లచ్చా పాత్రుడు అభినందనీయులని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చింతపల్లి ఒకటి, మూడు సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన "జగనన్న సురక్ష" కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు అందించిన ధ్రువీకరణ పత్రాలతో కలిపి మండలంలో మొత్తం 13 వేల పై చిలుకు ధ్రువీకరణ పత్రాలను కేవలం 24 రోజుల వ్యవధిలో మంజూరు చేయడమే గాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా, అదే క్రమంలో వాలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు నేరుగా అందజేయడం చరిత్ర అన్నారు. అనతి కాలంలోనే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎక్కువ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా మంజూరు చేసి అర్హులైన ప్రతి ఒక్కరి హృదయంలో లచ్చా పాత్రుడు స్థానం పదిల పరుచుకున్నారన్నారు.

వరదలో చిక్కుకున్న ప్రైవేట్ బస్సు

విశాలాంధ్ర - చింతూరు: ఆంధ్ర నుండి ఒడిశా వెళ్లే జాతీయ రహదారి 326 వరదలతో రోడ్డుపై నీరు ప్రవహిస్తుంది. సోమవారం ఉదయం ఆ నీటిలోనే ఒడిశా నుండి హైదరాబాద్ వెళుతున్న గుప్త ట్రావెల్స్ అనే ప్రైవేట్ బస్సు చింతూరు మండలంలోని కల్లేరుకుయ్ గుర్ గ్రామాల మధ్య ప్రమాదవశాత్తు రహదారి పక్కకు ఒరిగింది. వరద ఉధృతి కూడా పెరిగింది. డ్రైవర్ అప్రమత్తతతో బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులను దింపివేశారు. దీంతో ప్రయాణికులు మొత్తం సురక్షితంగా పెద్ద ప్రమాదం నుండి బయటపడ్డారు. అనంతరం ప్రొక్లెయినర్ సహాయంతో బస్సును రోడ్డుపైకి లాగారు.

వరదలకు దెబ్బతిన్న జాతీయ రహదారి

విశాలాంధ్ర - చింతూరు: గత వారం రోజుల నుండి ఎగువన గోదారి నది వరదలకు శబరి నది పోటెత్తింది. అడవుల్లో కురిసిన వర్షంతో రహదారిపై నుండి ప్రవహించడంతో జాతీయ రహదారి 326పై కల్లేరు-కుయ్ గుర్ గ్రామాల మధ్య కోతకు గురైంది. గత ఏడాది కూడా ఇదే ప్రదేశంలో రోడ్డు కొట్టుకుపోయింది. ఈ రోడ్‌లోనే బస్సులు ఒరిస్సా నుండి హైదరాబాద్, గ్రానైట్ లారీలు అత్యధిక బరువుతో ఆంధ్రకు వస్తుంటాయి. అలాగే ఆంధ్ర నుంచి ఒరిస్సాకు, ఒరిస్సా నుంచి ఆంధ్రకు నిత్యావసర వస్తువులు రవాణా చేసే వాహనాలు పగలు రాత్రి తేడా లేకుండా రవాణా అవుతుంటాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొండమొదలు కాలనీలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - దేవీపట్నం: ప్రజల వద్దకే అన్ని ఆధారాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ ప్రభుత్వం అని మండల అధ్యక్షుడు కుంజమ్ మురళీ అన్నారు. దేవీ పట్నం మండలం కొండ మొదలు ఆర్ అండ్ ఆర్ కాలనీలో సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష కింద ఇంత వరకూ పది సచివాలయాల పరిధిలో 10050 కుటుంబాలకు గాను 8200 కుటుంబాలకు సర్వే చేసి సుమారు 5000 సర్టిఫికెట్స్ మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ మొదలు సర్పంచ్ వేట్ల విజయ, తున్నూరు సర్పంచ్ చాదల విజయ, కుమారి, జేఎస్ఎం కన్వీనర్ కందుల బాబ్జీ, వైస్ ఎంపిపి గారపాటి మురళీ కృష్ణ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ రత్న కుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియ

విశాలాంధ్ర - కోటవురట్ల: మండలంలో వివిధ గ్రామాల్లో ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియ కొనసాగుతుంది. సోమవారం లింగాపురం, కోటవురట్ల, కైలాసపట్నం, గొట్టివాడ, చౌడువాడ, పొందూరు, రామచంద్రపురం తదితర గ్రామాల్లో బిఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఓటర్ జాబితాలో ఉన్న పేర్లు గల వ్యక్తుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డులు తదితర ఆధారాలను పరిశీలించి నిజమైన ఓటరుగా నిర్ధారణ చేస్తున్నారు. కైలాసపట్నం గ్రామంలో బిఎల్‌వో శ్రీకాంత్ వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ఓటర్ జాబితా పరిశీలన చేపట్టారు. కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులు వంటివి నమోదు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కైలాసపట్నం గ్రామ తెదేపా అధ్యక్షులు భీమిని మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర - పాయకరావుపేట: రైతులందరికి వ్యవసాయ పథకాలు అందాలంటే ఈపంట నమోదు తప్పనిసరి అని వ్యవసాయ శాఖ అధికారి ఆదినారాయణ అన్నారు. వ్యవసాయ ఏడి కార్యాలయంలో ఆర్‌బికె సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పథకాలయిన సున్నా వడ్డీ పంట రుణాలు, వైఎస్ఆర్ ఉచిత పంటల భీమా, రైతు భరోసా, పండించిన పంట ప్రభుత్వం కొనుగోలు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర అందాలంటే ఈపంట నమోదు తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓలు ఉమాప్రసాద్; సరోజిని, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించకుంటే చర్యలు: పీఓ అభిషేక్

విశాలాంధ్ర - అనంతగిరి: విద్యార్థిని విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే విద్యా హక్కు చట్టం కింద చర్యలు తప్పవని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ హెచ్చరించారు. సోమవారం మండలంలో పర్యటించిన పిఒ చిలకలగెడ్డ ప్రభుత్వ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సందర్శించారు. 10వ,9వ,8వ తరగతులకు వెళ్లి ఇంగ్లీష్, సైన్సు, హిందీ వంటి పాఠ్యాంశాలపై విడివిడిగా విద్యార్థులకు ప్రశ్నలు వేశారు. విద్యార్థులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో సంబంధిత తరగతి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ సబ్జెక్టులో కనీసం పుస్తకం చూసి పేర చదవగలిగే సామర్థ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. క్రమం తప్పకుండా మెనూ రోజువారీగా అమలు చేయాలని పాఠశాల తరగతి హాస్టల్ గదులు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. తిరుగు ప్రయాణంలో బాలికల పాఠశాల-2లో సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యపట్ల ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిడి కొండలరావు, మండల ఏటీడబ్యుఒ వెంకటరమణ, ఎంఈఓ బాలాజీ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సైమన్, మంగ, పిడి లక్ష్మణరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వెతలు పట్టని మత్స్య శాఖా మంత్రి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా

విశాలాంధ్ర - ఆనందపురం: మత్స్యకారుల కుటుంబంలో పుట్టి వైకాపా ప్రభుత్వంలో మత్స్య శాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టిన శీదిరి అప్పలరాజు మత్స్యకారుల సంక్షేమం కోసం ఏమి చేశారో చెప్పాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకారుల నాయకుడు గంటా నూకరాజు డిమాండ్ చేసారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గంటా నూకరాజు మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వస్తే మత్స్యకారుల కుటుంబాలను ఆదుకుంటామని చెప్పి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత మత్స్యకారులను నిలువునా ముంచారని అన్నారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకారుల కుటుంబంలో వలసలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేసారు. మత్స్యశాఖ మంత్రిగా ఉన్న సీదిరి అప్పలరాజు మంత్రి అయిన తరువాత ఎన్ని నిధులు మత్స్యకారుల కోసం కేటాయించారో చెప్పాలని డిమాండ్ చేసారు.

కనీసం మత్స్య సంపదకు సంబంధించి గిట్టుబాటు ధరల నిర్ణయం కోసం సంబంధిత శాఖకు చెందిన మంత్రి ప్రయత్నం చేయకపోవడం దారుణమని అన్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చమురు ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. అబద్దాలు చెప్పి మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల కోసం ఎటువంటి అభివృద్ధికి శ్రీకారం చుట్టారో వైట్ పేపర్ రిలీజ్ చేయాలని గంటా నూకరాజు డిమాండ్ చేసారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర - మాకవరపాలెం: రానున్న ఎన్నికల్లో వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆదివారం రాత్రి మాకవరపాలెం మండలం జి.కోడూరు గ్రామంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. వాళ్లకూ ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. భవిష్యత్తు తరాలకు భరోసా కలగాలన్న తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. నర్సీపట్నం నియోజవర్గంలో ఈ నాలుగున్నర సంవత్సరాలలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని, సంక్షేమ పథకానికి అర్హత ఉన్నా సరే ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా చేశారని విమర్శించారు.

నర్సీపట్నంలో అన్నా క్యాంటీన్ పెట్టి తాను రెండు రూపాయలకే మంచి భోజనం అందిస్తుంటే వైసిపి నాయకులు విమర్శిస్తున్నారని, అయితే వారు కూడా పేదవారికి భోజనం పెట్టవచ్చు కదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, కోడూరు మాజీ సర్పంచ్ బాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, నాయకులు అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

ఫుడ్ కోర్ట్ దుకాణాలు, టిడ్కో ఇళ్లు అవినీతిపై విచారణ చేయండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలోని పెదవాల్తేరు జాలరి పేటలో నిర్మించిన ఆదర్శ గ్రామం టిడ్కో గృహాల కేటాయింపులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, అర్హులకు కాకుండా పైరవీకారులకు గృహాలను మంజూరు చేశారని, ఇక్కడ నిర్మించిన 120 గృహాలను నిజమైన లబ్ధిదారులకు కేటాయించాలని జనసేన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గతంలో లబ్ధిదారులు అయినా వారికే తిరిగి కేటాయించారని, అర్హులు కానీ స్థానికేతర్లకు కూడా కేటాయించారన్నారు. నగరపాలక సంస్థ యుసిడి ప్రాజెక్టు డైరెక్టర్ స్థానిక అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై ఏకంగా 20 గృహాలను విక్రయించుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి అక్రమంగా జరిగిన గృహ కేటాయింపులను రద్దుచేసి అర్హులైన స్థానికులకే గృహాలను మంజూరు చేయాలని కోరారు. నగరపాలక సంస్థ యుసిడిలో పనిచేసే సమన్వయ కర్తలు పోస్టుల కోసం పలువురు ఆర్పి ల నుంచి కొందరు అధికారులు 3 లక్షల చొప్పున లంచాలు వసూలు చేశారని, ఈ పోస్టుల కోసం ఐదు లక్షల రూపాయలకు బేరాలు ఆడి అడ్వాన్స్ గా మూడు లక్షల రూపాయలను ఒక అడిషనల్ కమిషనర్‌కు, కొందరు యుసిడి అధికారులు వసూలు చేశారని మూర్తి యాదవ్ ఆరోపించారు. జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న సెంటర్ పార్క్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు కేవలం 26 మందికే యు సి డి అనుమతులు మంజూరు చేసిందని, అయితే ఇప్పుడు దాదాపు 160 మంది అక్కడ వ్యాపారం చేస్తున్నారని, వీరెవరికీ అనుమతులు లేవన్నారు. దీనిపై ఏర్పాటైన డిప్యూటీ మేయర్ నేతృత్వంలోని స్ట్రీట్ వెడ్డింగ్ కమిటీ అక్రమ వ్యాపారుల నుంచి లంచాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు.

దీపిక మృతిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలోని అనకాపల్లి మండలం రేబాక గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.దీపిక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేయాలని, సస్పెండ్ అయిన ఇద్దరు లెక్చరర్స్, లెక్చరర్స్‌పై పెట్టిన కేసును వాపస్ తీసుకోమని ఫోన్లో ఒత్తిడి తెచ్చిన విలేఖరి పాత్రపై దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్ఓ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ దీపిక ఆత్మహత్య వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్ నెలలో తమ కాలేజీలో ఇద్దరు లెక్చరర్స్ స్టూడెంట్స్‌ని ఇబ్బంది చేస్తున్నారని విద్యార్థులు కళాశాల ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారని దీనిలో మృతురాలు దీపిక ఉందని తెలిపారు. తరువాత దీనిపై సాంకేతిక శాఖ కమిషనర్‌కి కంప్లైంట్ వెళ్లడం, ఆర్.జె.డి.తో కలిపి ఐదుగురు సభ్యులు ఎంక్వయిరీ చేసి విద్యార్థులు చెప్పినది వాస్తవం అని ఇద్దరు లెక్చరర్స్‌ని సస్పెండ్ చేశారని అన్నారు. సస్పెండ్ అయిన తరువాత కూడా ఆ లెక్చరర్స్ మృతురాలికి ఫోన్ చేసి కంప్లైంట్‌ని వాపస్ తీసుకోమని రకరకాల రూపాల్లో ఒత్తిడులు చేయడం జరిగిందన్నారు. నాగులాపల్లికి చెందిన రిపోర్టర్ ఒకరు ఈ విద్యార్థినికి ఫోన్ చేసి కంప్లైంట్ వాపస్ తీసుకోమని కూడా ఒత్తిడి చేయడం జరిగిందని తోటి విద్యార్థులు చెప్తున్నారని అన్నారు. మృతురాలు దీపిక ఫోన్‌ని పరిశీలించినట్లయితే విషయాలు బయటకు రావచ్చని అన్నారు. బాధ్యులపై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని భాస్కర్ డిమాండ్ చేశారు.

అందరి సహకారంతోనే జగనన్న సురక్ష విజయవంతం

విశాలాంధ్ర - జి.మాడుగుల: వాలంటీర్లు ఇంటింటి సర్వే చేస్తూ ప్రజలకు అవసరమైన దృవపత్రాల కోసం అవసరమైన డాక్యుమెంట్లు పొంది సచివాలయ సిబ్బందికి అందించటం, సచివాలయ సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ దృవపత్రాలు జారీకి సహకరించటంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందని సంయుక్త కలక్టర్ జె.శివ శ్రీనివాసు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సొలభం-2 (గొందిపాడు), బొయితి సచివాలాయల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. సొలభం-2 సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జేసి మాట్లాడుతూ అవసరమైన దృవపత్రాలు పొందడం ద్వారా అర్హత కలిగిన పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, మండల ప్రత్యేఖాధికారి డిపిఆర్‌ఓ పి. గోవింద రాజులు, తహసిల్దార్ అప్పలస్వామి, ఎంపిడిఓ చంద్రశేఖర్, సర్పంచ్లు హనుమంత రావు, మాలమ్మ, ఎంపిటిసిలు చిన్నారావు, మాజీ ఎంపిపి బుజ్జి, పిఎసిఎస్ చైర్మన్ నాయుడు, సూరిబాబు, రత్నకుమారి, ఇతర పంచాయతీల సర్పంచ్లు కె. రాంబాబు, కొండబాబు, వైస్ ఎంపిపి సత్యనారాయణ, ఎంపిటిసిలు, సన్యాసి దొర, జేఎస్ఎస్ ఇంచార్జ్ లెంకల కళ్యాణ్, ఐసిడిఎస్, వెలుగు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల: జగనన్న సురక్ష కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల తహశీల్దార్ పివి.రత్నం అన్నారు. మాడుగుల మండలం జాలంపల్లి గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దార మల్లేశ్వరి చిన్ని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 780 మందికి వివిధ రకాల సురక్ష పత్రాలను అందజేసారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైసిపి ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

108లో ప్రసవం: తల్లి, బిడ్డ క్షేమం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం వాతంగి గ్రామానికి చెందిన చింతలజ్యోతి అనే మహిళ 108లో ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం నెలలు నిండిన జ్యోతిని 108లో జడ్డంగి పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరీక్షలు నిర్వహించి కాన్పు కష్టమని ఏలేశ్వరం హాస్పిటల్‌కి రిఫర్ చేశారు. ఆమెను ఏలేశ్వరం తరలిస్తుండగా మార్గమధ్యలోని రాయవరం వద్ద కాన్పు జరిగి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమమని 108 సిబ్బంది తెలిపారు.

వరద బాధితులకు త్రాగునీటి బోర్లు ఏర్పాటు

విశాలాంధ్ర - విఆర్ పురం: అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐఏఎస్, ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఐటీడీఏ పిఒ చొరవతో మండలంలోని రేఖపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సుద్ధగూడెం గ్రామ శివారులో మూడు హ్యాండ్ బోర్లు వేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మాట్లాడుతూ శబరి, గోదావరి వరదల కారణంగా ప్రతి సంవత్సరము త్రాగు నీటికి చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పుడు ఆ సమస్య తీరిందన్నారు.

ఎడతెరిపి లేని వర్షాలు

విశాలాంధ్ర - మారేడుమిల్లి: గత వారం రోజులుగా ఎడతెరిపిలేని వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటూ ఇంటికే పరిమితమయ్యారు. కొండ వాగులు పొంగిపొర్లి రోడ్లమీదకి రావడంతో రహదారులు అస్తవస్తంగా తయారయ్యాయి. కొండ చరియలు విరిగిపడడంతో గిరిజన గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. చెట్లు విరిగి కరెంటు తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడి లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మారేడుమిల్లి- చింతూరు మధ్య రహదారిలో చెట్టు రోడ్డుకి అడ్డంగా పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

హైడ్రోజల్ వినియోగంపై సమావేశం

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాకవరపాలెం మండలం తామరం పంచాయతీలో సోమవారం రెయిన్ సాల్ట్(హైడ్రోజల్) వినియోగం, ఆవశ్యకతపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏటిఎంఎ విడి ఆశాదేవి హాజరై మాట్లాడుతూ నీటి ఎద్దడి, మెట్ట ప్రాంతాలలో హైడ్రోజల్‌తో ఉపయోగం ఉంటుందో వివరించారు. డిఆర్‌సి ఏడిఎ పి.శ్రీధర్‌రావు మాట్లాడుతూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఒ చిరంజీవి, విజేత, తులసి, మణి పాల్గొన్నారు.

ఒమ్మలి జనసేన పార్టీ కమిటీ నియామకం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఒమ్మలి జనసేన పార్టీ కమిటీ నియామకం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షునిగా అశోక్, ఉపాధ్యక్షులుగా ఉండూరు మహేష్, కార్యదర్శిగా టి.రామకృష్ణ, కోశాధికారిగా తాటికొండ సత్తిబాబు, కార్యవర్గ సభ్యులుగా పెంటారెడ్డి గణేష్, జన్నపల్లి గణేష్, పాతాళ శ్రీను, గొర్లి సన్యాసిరావు, ఖాతా గణేష్మరి ఇంకో నలుగురు సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దాసరి అచ్యుతరావు, విశాఖ జిల్లా రూరల్ కమిటీ సభ్యులు అప్పలనాయుడు, గుమ్మాల నాగరాజు, పాముగట్టి శివాజీ, ఉండూరు కుమార్, దండి రమణ, ఎం.అజిత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర - పెదబయలు : ఈనెల 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు జరగనున్న మావోయిస్టు వారోత్సవాలు నేపథ్యంలో సోమవారం స్థానిక ఎస్సై పులి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల నుండి ఆధార్ కార్డులు పరిశీలించి విడిచిపెట్టారు. అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపిస్తే తమకు తెలియపరచాలని తెలిపారు.

వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా మట్ట ప్రసాద్

విశాలాంధ్ర -పెందుర్తి: పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ గొరపల్లి గ్రామానికి చెందిన మట్ట ప్రసాద్‌ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీకి సేవలు అందించిన కార్యకర్తలకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని, పార్టీ అభివృద్ధి కోసం యువకులు అందరూ ముందుకు రావాలని మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డిని చేసేందుకు యువకులు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ బాద్యతలు అప్పచెప్పిన ఎమ్మెల్యేకి అలాగే పెందుర్తి పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు ప్రసాద్ తెలియజేశారు.

గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఎటపాక: రాయచోటిలో ఈనెల 27 జరిగే ఏపి గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సమాఖ్య సహాయ కార్యదర్శి వాసం రాము పేర్కొన్నారు. ఈనెల 30వరకు రాయచోటిలో జరిగే మహా సభలను విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమానికి గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు హాజరు కానున్నట్లు చెప్పారు.

విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

మంగళవారం 25, జూలై, 2023

నేడు 85 అంశాలతో మహా కౌన్సిల్..... 41 అంశాల అనుబంధ అజెండా...

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం నేడు జరగనుంది. ఇప్పటికే 44 అంశాలతో అజెండా తయారు చేసిన అధికారులు, అంతే స్థాయిలో 41 అంశాలతో అనుబంధ అజెండాను రూపొందించి సభ్యులకు అందజేశారు. అందులో వైకాపా కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేయడంపై విపక్ష సభ్యులు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రజాసమస్యలు పరిష్కరించడంలో వైసీపీ పాలకవర్గం తీవ్రంగా విఫలమైందని, అభివృద్ధి పనులు కూడా కేవలం వారి వార్డులోనే చేపడుతున్నారని ప్రతిపక్ష సభ్యులు మండిపడుతున్నారు. జీ 20 పనుల పేరిట కొట్లాది రూపాయలు దుర్వినియోగం జరిగిందని నేడు జరిగే కౌన్సిల్‌లో గట్టిగా నిలదీస్తామని కొంతమంది సభ్యులు తెలియజేశారు. కాపులుప్పాడ డంపింగ్ యార్డులో ఘనవ్యర్థాల నిర్వహణలో భాగంగా 24.20 ఎకరాల్లో బయోమైనింగ్ కోసం రూ.43.80 కోట్లు ఖర్చు చేసే అంశాన్ని ప్రతిపాదించారు. బీచ్ ఐదేళ్లపాటు ఇసుకను జల్లెడ పట్టడానికి రూ.1.82 కోట్ల వ్యయం చేసే మరో అంశాన్ని చేర్చారు. బీచ్ రోడ్డులో ఎల్ఈడీ తెరలపై ప్రకటనలకు ధరలు నిర్ణయించి, గెజిట్‌లో పొందుపరచడానికి అనుమతి కోరనున్నారు. జి-20 సన్నాహక సదస్సుల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఎల్ఈడీ తెరలను కనీసం టెండర్లు ఆహ్వానించకుండా అధికార పార్టీకి చెందిన వారికే అప్పనంగా అప్పగించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెలువెత్తాయి.

అడవివరం, పాతగోశాల, కుమ్మరివీధి ప్రాంతాలలో రహదారి, వరద నీటి కాలువల నిర్మాణానికి రూ.38 కోట్ల వ్యయం చేయనున్నారని పాలకవర్గం అనుమతి కోరుతూ అనుబంధ అజెండాలో పొందుపరిచారు. అనకాపల్లిలో 80 నుంచి 84వ వార్డు వరకు 12 అభివృద్ధి పనులకు రూ.14.88 కోట్లు వ్యయం చేసే అంశాలను అజెండాలో చేర్చాగా, 8 నెలల కాలానికి ఎర్రిగెడ్డ నిర్వహణకు రూ.89.75 లక్షలు, పాతనగరం జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు వరకు మాస్టర్ ప్లాన్ రహదారి విస్తరణ, కాలువల నిర్మాణానికి రూ.12.48కోట్ల వ్యయం చేయ నున్నట్లు అజెండాలో ప్రతిపాదనలు పెట్టారు. హనుమంతువాక నుంచి కైలాసగిరి కూడలి వరకు ప్రస్తుతమున్న మాస్టర్ ప్లాన్ రహదారి సమగ్ర అభివృద్ధికి రూ.3.94 కోట్ల వ్యయం చేయనున్నారని, సత్యంకూడలి నుంచి సీతమ్మధార, వెంకోజీపాలెం వరకు నడక మార్గాల అభివృద్ధికి రూ.5. 35కోట్ల వ్యయం చేసే ప్రతిపాదనను అనుబంధ అజెండాలో చేర్చారు. వీటితోపాటు వైసిపి కార్పొరేటర్ల వార్డుల్లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఈ అజెండా అనుబంధ అజెండా చేర్చడంపై నేడు జరిగే కౌన్సిల్ సమావేశంలో రసభస తప్పదని తెలుస్తుంది.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో – అనకాపల్లి: గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశించారు. అనకాపల్లి మండలం కొండుపాలెం, చేనుల అగ్రహారం గ్రామాలలో ఎంపీపీ గొర్లె సూరిబాబు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన గడపగడపకు కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు కొన్ని సాంకేతిక కారణాలవల్ల అందలేదని ఒకరిద్దరు మంత్రి అమర్నాథ్ దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత సిబ్బందిని పిలిచి వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కాగా ఈ గ్రామంలో కాలువల నిర్మాణానికి 20 లక్షల రూపాయలు ఇస్తున్నట్లు మంత్రి అమర్నాథ్ ప్రకటించారు. చేనుల అగ్రహారం గ్రామంలో ఒక వీధిలో తమకు రోడ్డు లేదంటూ మహిళలు మంత్రి అమర్నాథ్ వద్ద వాపోయారు. వెంటనే స్పందించిన ఆయన ఆ విభాగానికి చెందిన అధికారులను పిలిచి, రోడ్డు ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయమని మంత్రి ఆదేశించారు. మంత్రి అమర్నాథ్ అక్కడ ఉండగానే, సిబ్బంది దీనికి సంబంధించిన కార్యాచరణకు దిగటం గమనార్హం. అలాగే ఈ గ్రామంలోని పెద్ద కాలువ పూడిక తీయించేందుకు తీయించేందుకు 30,000 రూపాయలు కేటాయిస్తున్నట్టు మంత్రి అమర్నాథ్ చెప్పారు. కొండుపాలెం గ్రామంలో 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను, 10 లక్షల రూపాయలతో నిర్మించిన కాలువలను, 13.8 లక్షల రూపాయల వ్యయంతో నాడు నేడు పథకం కింద అభివృద్ధి చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, 10.30 లక్షల రూపాయలతో నిర్మించిన 20 కిలో లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకును మంత్రి ప్రారంభించారు. కాగా ఈ గ్రామంలోని కుమ్మరి వీధిలో నూకాలమ్మ తల్లి ఆలయ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని ఆలయ కమిటీ సభ్యులు మంత్రి అమర్నాథ్ దృష్టికి తీసుకువచ్చారు.

దీనిపై స్పందించిన ఆయన వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిటీ సభ్యులకు ఆయన సూచించారు. చేనుల అగ్రహారం గ్రామంలో అమ్మవారి ఆలయాన్ని, ఆలయ ఆవరణలో ఉన్న బోరును ప్రారంభించారు.

ప్రముఖ ఆయుర్వేద వైద్యుడుకు అరుదైన అవార్డు

విశాలాంధ్ర – చింతూరు: పలిస్టిక్ మెడిసిన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ కాంగ్రెస్ ట్రెడిషనల్ మెడిసిన్ మహాసభ లు న్యూఢిల్లీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగాయి. ఇట్టి మహాసభలో ప్రపంచ దేశాల నలుమూలల నుండి సాంప్రదాయ వైద్యులు హాజరైనారు. హెచ్ఎంఆర్ఎఫ్ డైరెక్టర్ అఫ్ జనరల్ దీపక రౌత్, వరల్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ సుభాని, వి హెచ్ ని సి ఫౌండర్, డైరెక్టర్ అఫ్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ పి ఎస్ సాగర్, ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సాంప్రదాయ వైద్య మహాసభకు ముఖ్య అతిథులుగా నేపాల్ దేశానికి చెందిన డాక్టర్ రామ్ అధర్ యాదవ్ (హెల్త్ మినిస్టర్) అనంత వీరధర్ మినిస్టీ ఆఫ్ ఆయుష్, సిబి లోహియా. టెక్నికల్ అడ్వైజర్ పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఆంధ్ర ప్రదేశ్ లోని చింతూరు మండలం నిమ్మలగూడెం గ్రామంలో ఆఫ్రిన్ ఆయుర్వేద దవాఖాన కు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ జమాల్ ఖాన్‌కు దేశ రాజధాని ఢిల్లీలో సాంప్రదాయ ఆయుర్వేద అవార్డును ప్రపంచ దేశాల నుండి వచ్చిన ప్రొఫెసర్లు జమాల్ ఖాన్‌ను వేదికపైకి ఆహ్వానించి రాష్ట్రీయ వైద్య సన్మాన్ అవార్డుతో పాటుగా స్టార్ సిల్వర్ అవార్డు మరియు తలపాగాను పెట్టి ఘనంగా సన్మానించారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర – హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎంపిపి కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. సోమవారం మండలంలోని తడిగిరి సచివాలయ కేంద్రంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో గిరిజనులకు 433 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. జగనన్న సురక్ష పథకాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుర్గం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో డీటీ రంగారావులు తదితరులు పాల్గొని 650 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ రాజలక్ష్మి, ఈవో పీఆర్డీ అశోక్ కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ సంజీవరావు, వాణిజ్య విభాగం అధ్యక్షులు ఒంటూబు సామ్యూల్, దా.వైఎస్ఆర్, టీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ తెడబారికి సురేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్లు పెనుమల రంజిత్, రవణమ్మ, ఎంపిటీసీ వరదాని భీమలింగేశ్వరరావు, మత్స్యలింగం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర – పాయకరావుపేట: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. కాకినాడలో నేషనల్ యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారిచే జూలై 23న నిర్వహించిన అండర్-14 యోగా పోటీల్లో జి.సోమ సూర్య చరణ్, జి.హర్షవర్ధిని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేతలు సీహెచ్‌వి కె నరసింహారావు, సీహెచ్ విజయ్‌ప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవిఎస్ మూర్తి, హెచ్ఎంలు అపర్ణ, నీలాదేవి, యోగా గురువు సురేష్ తదితరులు అభినందించారు.

ఓటరు సర్వే పక్కాగా నిర్వహించండి

విశాలాంధ్ర – జి.మాడుగుల: ఓటరు సర్వేను పక్కాగా నిర్వహించాలని సంయుక్త కలక్టర్ జే.శివ శ్రీనివాసు ఆదేశించారు. సోమవారం సొలభం-2 (గొందిపాడు) లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసి తిరుగు ప్రయాణంలో కొత్తూరు గ్రామంలో జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా బిఎల్ఒలకు పలు సూచనలు జారీ చేసారు. ఓటరు వెరిఫికేషన్ లో తప్పని సరిగా పేరు, తండ్రి/భర్త పేరు, ఫోటో, పుట్టిన తేది, చిరునామా, మొబైల్, ఆధార్ నంబర్లు తదితర వివరాలు పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ అప్పల స్వామి, మండల ప్రత్యేకాధికారి డివిఆర్. గోవింద రాజులు, ఎఈఓ కుమారి, బిఎల్ఒలు జీవన్, తరుణ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డు బాగుచేయించరూ..?

విశాలాంధ్ర – వి.ఆర్.పురం: మండల పరిధిలోని రాజుపేట గ్రామపంచాయతీ రాజుపేట కాలనీ గ్రామంలో గ్రామ సచివాలయం ప్రక్కనే ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్డు బురదమయంగా మారింది. ఈ రహదారి మీదుగా గ్రామస్తులు ప్రయాణం చేయాలంటే నరకయాతన పడవలసిన పరిస్థితి నెలకొంది. ఈ రహదారిపై వాహనదారులు వెళ్లాలంటే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిపై ఎన్ని సార్లు పోయినా రోడ్డుకు అడ్డంగా పెద్ద కాలువ తీయడం వలన చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందని అన్నారు.

ఘనంగా 8వ టెరిబెర్కా ఆర్కిటిక్ ఫెస్టివల్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: టెరిబెర్కా ఆర్కిటిక్ ఫెస్టివల్ 2023లో 15,000 మంది అతిథులను ఆహ్వానించింది, ఇది మునుపటి సంవత్సరం కంటే 150 శాతం ఎక్కువ. ఈ కార్యక్రమంలో 16 మంది కళాకారులు, 50 మంది మాస్టర్ క్లాస్ లు, సంబంధిత కార్యకలాపాలు, ఏడు ప్రొఫెషనల్ గైడెడ్ ఫెస్టివల్ వాకింగ్ టూర్ లు రెండు ట్రయల్ రన్ లు ఉన్నాయి. 2021-2023 లో ఆర్కిటిక్ కౌన్సిల్ అధ్యక్ష పదవికి రష్యా ప్రణాళికలో భాగంగా ముర్మాన్స్క్ ఒబ్లాస్ట్‌లోని అదే పేరు గల గ్రామంలో జూలై 15-16 న ఈ ఉత్సవం జరిగింది. అధ్యక్షత కార్యకలాపాలను రోస్ కాంగ్రెస్ ఫౌండేషన్ నిర్వహిస్తుంది. ఆర్కిటిక్ మన వర్తమానం, ఇది మొత్తం గ్రహం యొక్క భవిష్యత్తు. ఇది బలమైన ఉత్సాహవంతులు, దైర్యవంతుల ప్రజల భూమి, శక్తివంతమైన ప్రభుత్వ ప్రాజెక్టుల ఫలించే ప్రదేశం, దాని సంస్కృతిని జాగ్రత్తగా పరిరక్షించే భూమి. ఇందులో ప్రత్యేకమైన గ్యాస్ట్రోనమిక్ సంప్రదాయాలు ఉన్నాయి.

జన సైనికుడి కుటుంబానికి సాయం

విశాలాంధ్ర – చీడికాడ: మాడుగుల నియోజవర్గం చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన క్రియాశీలక జన సైనికుడి కుటుంబానికి మాడుగుల నియోజవర్గంలో ఉన్న తోటి జనసైనికులు కలిసి 45 వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకి అందజేశారు. తదుపరి జనసైనికులు మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నట్లయితే సహజ మరణం పొందిన సరే నియోజవర్గంలో ఉన్న జనసైనికులు అందరూ కలిసి తలో చేయి వేసి వారి కుటుంబానికి అండగా ఉంటారని తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మజ్జి కృష్ణ, ముర్రు ఈశ్వర్, రాయవరెడ్డి కృష్ణ, జివి మూర్తి, గట్టా రామారావు, గుమ్మడి సంతోష్, కుంచె అంజిబాబు, సుంకర అప్పారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సర్వసభ్య సమావేశాలెందుకు..?

విశాలాంధ్ర – హుకుంపేట: మండల సమస్యలు పరిష్కారం కానప్పుడు సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం ఎందుకని మెట్టుజోర సర్పంచ్ సిథరి సాంబ, సోకిలి కృష్ణారావులు ఆరోపించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో పలువురు సర్పంచులు సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో సిసి రోడ్డు, మంచినీటి సౌకర్యం, కరెంటు, డ్రైనేజ్, తదితర సమస్యలపై సర్వసభ్య సమావేశం జరిగినప్పుడల్లా విన్నవిస్తున్నావని ఏళ్ల తరబడుతున్న తమ సమస్యలు పరిష్కారం కాకుండా దా సర్పంచ్ పదవులు ముగుస్తాయేమోనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు మేము ఏవో చేస్తామని ఎన్నో ఆశలు పెట్టుకొని మమ్మల్ని ఎన్నుకుంటే వారి సమస్యలను తీర్చలేకపోతే మాకు ఈ పదవులు ఎందుకన్నారు. అధికారులు సైతం మా సమస్యలపై సీత కన్ను పెట్టడం మాకు ఎంతో బాధకరంగా ఉందని అలాంటప్పుడు అభివృద్ధి చర్చల కోసం సర్వసభ్య సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. చర్చ సమావేశం నిర్వహించేటప్పుడు అధికారులు కూడా దుమ్మా కొడితే ఎవరిని ప్రశ్నించాలని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఏవీటీజీ పిల్లలకు సక్రమంగా విద్య అందేలట్టు అధికారులు చర్య చేపట్టాలని గత నెలలో మన రాష్ట్రపతి వారితో జరిగిన సమావేశంలో పీవీటిజి పిల్లలకు ప్రత్యేక పథకాలు కల్పించాలని తెలిపారన్నారు. అలాగే పదవ తరగతి మరి ఎనిమిదవ తరగతి ఆరో తరగతి లలో, ఏకలవ్య పాఠశాలలో తమ పిల్లలకు సక్రమంగా సీట్లు అందేటట్టు చర్యలు అధికారులు చేప ట్టాలని వారు కోరారు. అనంతరం ఈ కార్య క్రమం సందర్భంగా ఎంపీపీ కూడా రాజు బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అన్ని గ్రామాలకు అందే విధంగా ప్రభుత్వం చేస్తున్నదని అయితే అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా జరుగుతుందో లేదో చూసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రస్తుతం మన ప్రభుత్వం నిధులిచ్చే పరిస్థితులలో లేదని, నిధులు మంజూరు అయితే తప్పక సిసి రోడ్డు మంచినీటి సౌకర్యాలు డ్రైనేజీలు చేద్దామ న్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రేగం మ త్యా లింగం, ఎంపీడీవో వెంకట్రావు, ఐసిడిఎస్ సిడిపిఓ బాలచంద్రమణి దేవి, ఆర్డబ్ల్యూఎస్ జేఈ రమేష్, ట్రైబల్ వెల్ఫేర్ జే ఈ ధ్రువ, వెటర్నరీ డాక్టర్ కే చరణ్, ఏ టి డబ్ల్యు రజిని, వెలుగు ఏపీఎం చిన్నారావు, వైస్ ఎంపిపిలు సూడిపల్లి కొండల రావు, ఒంటూబు ప్రియాంక, పలువురు ప్రభుత్వ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెప్పే జైసే బాత్ నహీ పాట విడుదల

విశాలాంధ్ర – విశాఖ సిటీ: వయాకామ్ 18 సహకారంతో బాలీవుడ్ మెలోడీని హిప్- హాప్ గల్లితో సమ్మిళితం చేస్తూ పూర్తి సరికొత్త జోనర్‌కు శ్రీకారం చుడుతూ చేపట్టిన మొట్టమొదటి సంగీత ప్రయోగం రాయల్ స్టాగ్ బూమ్‌బాక్స్ చేపడుతున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. సంగీతం అనేది అన్ని వయస్సుల వారిలో భావోద్వేగాలను రేకెత్తిస్తుందన్నారు. సీగ్రామ్ రాయల్ స్టాగ్‌కు ఇది కీలక పునాదిరాయిగా నిలిచిందని, ఈ అధునిక యుగపు యువ ప్రేక్షకుల ఉత్తేజకరమైన కొత్త సంగీత స్వరూపాలను అన్వేషించడానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నారన్నారు. 'లివింగ్ ఇట్ లార్జ్' స్ఫూర్తిని అందిపుచ్చుకొని మణిపాల్, భువనేశ్వర్, పూణే, ఇండోర్ %e% డెహ్రాడూన్‌లోని వేలాది మంది సంగీత ప్రియులను తనదైన ప్రత్యేక అనుభూతి ద్వారా ఆకట్టుకున్న రాయల్ స్టాగ్ బూమ్‌బాక్స్ 4 ఒరిజినల్ మ్యూజిక్ వీడియోలతో తదుపరి దశలోకి ప్రవేశించనుందని తెలిపారు.

పక్కాగా ఇంటింటి ఓటర్లు సర్వే: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – పాడేరు: బూత్ స్థాయి అధికారులు ఇంటింటి ఓటరు సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఈనెల 21 వ తేదీ నుండి బూత్ స్థాయి అధికారులు సర్వే చేస్తున్నారని, పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. పాడేరు, రంపచోడవరం డివిజన్ల రెవెన్యూ అధికారులతో ఓటరు సర్వే, భూముల రీసర్వే ప్రక్రియపై సోమవారం కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులతో మాట్లాడుతూ ఫారం 6, ఫారం 7, ఫారం 8 సేకరణ సక్రమంగా చేయాలన్నారు. తాహశీల్దారుల కార్యాలయంలో పెండింగ్ కుల ధృవీకరణ, కుటుంబ ధృవ పత్రాలు జారీ చేయడం లో జాప్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. భూముల రీసర్వే కు నిర్దేశించిన లక్ష్యాలను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, పాడేరు ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, పాడేరు రంపచోడవరం డివిజన్ల తాహశీల్దారులు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవలపూడిలో ఎమ్మెల్యే గడప-గడపకు ఆత్మీయ స్వాగతం

విశాలాంధ్ర – నర్సీపట్నం: నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ నిర్వహించారు. నర్సీపట్నం మండలంలో రాజకీయంగా కీలకమైన ఈ గ్రామంలో, గడపగడపలోను ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం లభించింది. డప్పు వాయిద్యాలు, చిడతల భజనలతో, ఎమ్మెల్యే గణేష్ కు గ్రామ వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలతో సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించడం కోసం, పేదరిక నిర్మూలన కోసం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వేములపూడి ఎంపీటీసీలోలం వెంకటేష్ ,గుడివాడ లోవరాజు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైసీపీ నర్సీపట్నం మండల పార్టీ ప్రెసిడెంట్ సుర్ల సత్యనారాయణ, సర్పంచ్ లు శెట్టి శ్రీను, వెంకటరత్నం, కన్నయ్య నాయుడు, ఐటుకు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర – యస్.రాయవరం: ప్రజాసమస్యలు పరిష్కరించడానికి గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. సోమవారం మండలంలోని గుడివాడ గ్రామ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం లో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఎంపీడీవో రాయచంద్రమూర్తి, తహశీల్దార్ విజయకుమార్, మండల వైసిపి కన్వీనర్ కొంతాల శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ దూళి శ్రీనుబాబు, వైసిపి సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మాతా గురునాథరావు, అల్లాడ నాగరాజు, పుట్టా సుధాకర్, మధు వర్మ, శ్రీపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

విశాలాంధ్ర – యస్.రాయవరం: మండలంలోని గుడివాడ పంచాయతీ పరిధిలో వేరువేరు సంఘటనలలోని ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. స్థానిక ఎస్సై పొన్నాడ ప్రసాదం అందించిన వివరాలు ప్రకారం గుడివాడ పంచాయతీ పరిధిలో లక్ష్మీపతి రాజుపేట ఒమ్మి బాలరాజు 26 అనే యువకుడు రోజువారీ తన స్నేహితుడు ఇంటికి వెళ్లి నిద్రపోతానని చెప్పి వెళ్లడం జరిగింది. సోమవారం ఉదయం వారి కుటుంబ సభ్యులు బాలరాజుకు ఫోన్ చేసిన పని చేయకపోవడంతో నలకడం జరిగింది. సమీపంలో జీడి తోటలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడాని ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై విచారణ చూస్తున్నా మన్నారు. ఇదే గ్రామ పరిధిలో కొత్త పోలవరం గ్రామంలోని బత్తిన సత్యవతి(38) అనే మహిళ ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందింది కొద్ది సంవత్సరాల కూతురుపై బెంగతో మనస్థాపంతో బాధపడుతున్న ఆమె ఆత్మహత్య చేసుకున్నదని ఎస్సై తెలిపారు. సంఘటనలు తెలుసుకున్న నక్కపల్లి సీఐ జి అప్పన్న సంఘటన స్థలాలకు చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలపై కాంతిలాల్ దండేకు వినతి

విశాలాంధ్ర – అనంతగిరి: అనంతగిరి మండలంలో పర్యటనకు వచ్చిన ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేకు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ కి మండల సమస్యలపై,విద్యాశాఖ సమస్యలపై వినతి అందించారు. ఈ సందర్భంగా జడ్పీటిసి దీసరి గంగరాజు, భాష వలంటీర్ల జిల్లా అధ్యక్షులు పాంగి కుమారి లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐటీడీఏ గిరిజన ప్రాంతాల ప్రాచీన ఆదివాసి గిరిజన తెగల అభివృద్ధి కోసం, మాతృభాష విద్య బోధన కోసం ప్రభుత్వం అమలు చేస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా 1242 మంది మాతృభాష వాలంటీర్లును పనిచేస్తున్నారని అన్నా రు. సుమారు 50000 మంది గిరిజన విద్యా ర్థులకు 1వ 2వ తరగతులకు మాతృభాషలో విద్య బోధన అంది స్తున్నారన్నారు. ఆదివాసీ మాతృభాషలైన కువి, కొండ, ఆదివాసి,ఒరియా, సవరా, సుగాలి, కోయ భాషలో విద్యను బోధిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ మాతృభాష భాష విద్య వాలంటీర్లను ప్రతి ఏడాది కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాష వలంటీర్ల జిల్లా అధ్యక్షులు పాంగి కుమారి, వంతల నాగేంద్ర, సురేష్ ఉన్నారు.

మహనీయుల విగ్రహాల ఎదుట పార్కింగ్...!

విశాలాంధ్ర – హుకుంపేట: మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రతిష్టించిన జాతిపిత మహాత్మ గాంధీ, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, స్వాతంత్ర సమరయోధుడు మద్రి కామయ్య వంటి జాతీయ నాయకులను పూలతో పూజించవలసిన స్థలంలో మండల శాఖ అధికారులు ద్విచక్ర వాహనాలు నిలుపడం చేసి పార్కింగ్ స్థలంగా వినియోగించుకొని మన జాతీయ నాయకులను అవమానిస్తున్నారు. ఇటువంటి నాయకుల కోసం భారతదేశమంత పూజిస్తూ ఉంటే ఇక్కడ మాత్రం అధికారులు, ప్రజా ప్రతినిధుల విగ్రహాల ముందు ద్విచక్ర వాహనాలు పెట్టి అవమానిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సైతం కార్యాలయానికి వెళ్తూ ఉండి కూడా ద్విచక్ర వాహనాలు పెడుతున్నా వారిపై ఒక మాట కూడా మాట్లాడక పోవడం శోచనీయం. ఇటువంటి తప్పిదాల వలన మన జాతికే అవమానించుకున్నట్టు అవుతుందని పలువురు గుసగుసలాడుతున్నారు.

సెల్లర్-ఫ్రెండ్లీ పాలసీలను మెరుగుపరిచిన ఫ్లిప్‌కార్ట్

విశాలాంధ్ర – విశాఖ సిటీ: భారతదేశంలోని స్వదేశీ ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్, దేశవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ వృద్ధిని బలోపేతం చేసే లక్ష్యంతో విక్రేత పర్యావరణ వ్యవస్థను మెరుగుపరిచినట్లు సంస్థ ప్రతినిధి వెల్లడించారు. 'ఫ్లిప్‌కార్ట్ ఎడ్జ్' కార్యక్రమం కింద ఈ పాలసీలు 2022లో వేసిన పునాదిపై ఆధారపడి ఉంటాయన్నారు. ఈ ప్రోగ్రామ్ ఆన్‌లైన్ వ్యాపార అవకాశాన్ని ఉపయోగించుకోవడంలో ఫ్లిప్‌కార్ట్ ప్లాట్‌ఫారమ్‌లో వ్యాపారాన్ని సులభతరం చేయడంలో వ్యాపారాలకు సహాయం చేయడంపై గట్టిగా దృష్టి పెడుతుందన్నారు. ఈ విధానాల అమలుతో, ఆన్‌లైన్ విక్రేత పర్యావరణ వ్యవస్థ ఇ-కామర్స్ అందించే అపారమైన సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడం ద్వారా దాని తదుపరి దశ వృద్ధిని ప్రారంభిస్తోందని, ధరల సిఫార్సులు, ప్రమోషన్లు, రివార్డ్ ప్లాట్‌ఫామ్, ఫుల్ ఫిల్‌మెంట్ స్పీడ్ ఇనిషియేటివ్‌లు, గ్రోత్ అసిస్టెన్స్‌తో సహా కొత్త ఫీచర్ల ద్వారా మెరుగైన స్పష్టత, నియంత్రణ పారదర్శకతతో విక్రేత పర్యావరణ వ్యవస్థను శక్తివంతం చేయడం ఫ్లిప్‌కార్ట్ లక్ష్యమని చెప్పారు.

ఘనంగా అయ్యంకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర – పాయక రావుపేట: గ్రంథాలయ పితా మహుడు, స్వాతంత్ర్య సమర యోధుడు అయ్యంకి రమణయ్య జయంతి వేడుకలు స్థానిక శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారి వామల లక్ష్మణరావు మాట్లాడుతూ అయ్యంకి 17 ఏళ్లనే గాంధీజీ ప్రభావంతో చదువు వదిలి స్వతంత్ర ఉద్యమంలో చేరారని తెలిపారు. 1908లో గ్రంథాలయ ఉద్యమ శంఖారావాన్ని పూరించారని అన్నారు.

మణిపూర్ ఘటనపై దళిత విముక్తి రాష్ట్ర కమిటీ ఆందోళన

విశాలాంధ్ర – పోడవరం: కుకి ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు అత్యంత హేయమని దళిత విముక్తి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చోడవరం లో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో దళిత విముక్తి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ మాట్లాడుతూ దేశం తలదించుకునే విధంగా మణిపూర్ లోని కుకీ తెగ ఆదివాసీ మహిళలపై లైంగిక అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. కుకీ ఆదివాసీ తెగ ప్రజలపై ఆదివాసేతర మెయితీలు నుండి హింసాత దాడులు పరంపర కొనసాగుతూనే ఉందని, వాటిని అదుపు చేయడంలో బిజెపి రాష్ట్ర ,కేంద్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి అని తెలిపారు. ఈ నేపథ్యంలో దళితులు, ఆదివాసులపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉందని, దీంతో భాగమే మణిపూర్ మారణ హోమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత విముక్తి రాష్ట్ర కమిటీ ద్వారకా నగర్ సంక్షేమ సేవా సంఘం చోడవరం అధ్యక్షులు ఎస్ సంజీవ్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె. హుస్సేన్,సెక్రటరీ డి బోడయ్య, కోశాధికారి సతీష్, సంఘ నాయకులు పేరయ్య, ఈశ్వరమ్మ, అప్పయ్యమ్మ, జ్యోతి, మోతి, జైన, చెన్నారావు, బాబూరావు, శంకర్, డి చంటి పాల్గొన్నారు.

అయ్యంకి వెంకట రమణయ్య చిరస్మరణీయుడు

విశాలాంధ్ర – మల్కాపురం: గ్రంథాలయ ఉద్యమకారుడు శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య చిరస్మరణీయుడని, దేశ స్వాతంత్ర్యానికి, గ్రంథాలయ ఉద్యమానికి ఆయన చేసిన సేవలు అమోఘమని ప్రముఖ న్యాయవాది జి.వి.ఆర్.రాజు అన్నారు. స్థానిక మల్కాపురంలోని ప్రకాష్ నగర్‌లో గల శాఖా గ్రంథాలయంలో సోమవారం అయ్యంకి వెంకట రమణయ్య జయంతి ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. సమావేశంలో ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, ప్రముఖ కార్మిక నాయకులు బి.సత్యానందం, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, జాతీయ సేవా పథక సీనియర్ ప్రోగ్రామ్ అధికారి పి. అనసూయదేవి, గ్రంథాలయ అధికారి వి.అజయ్ కుమార్ తదితరులు సమావేశంలో మాట్లాడారు.